# విద్యార్థులు చదువుతోపాటు కళల్లోను రాణించాలి

• కలెక్టర్ జితేష్ వీ పాటిల్


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

**కొత్తగూడెం (టౌన్), సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ):** విద్యార్థులు చదువుతోపాటు కళలలో కూడా రాణించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా స్థాయి కళా ఉత్సవం పోటీలను ప్రారంభించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. చిన్నప్పుడు తనకు కూడా కళల పట్ల ఆసక్తి ఉండేదని, చిన్నతనంలో సంగీత ఉపాధ్యాయురాలు అంటే తనకు ఎంతో ఇష్టమని, కానీ వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయానని తెలిపారు. కానీ నేటి విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటేనే భవిష్యత్తు ఆకర్షణీయంగా ఉంటుందని సూచించారు. పిల్లలందరూ తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడానికి దారి చూపించే ఒక మార్గమే ఇటువంటి పోటీలని పిల్లలకు ఉద్బోధించారు. జిల్లా విద్యాశాఖ అధికారి బీ. నాగలక్ష్మి మాట్లాడుతూ పిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొని తీపి జ్ఞాపకాలను తమతో తీసుకువెళ్లాలని సూచించారు. ఈ పోటీలలో సుమారు రెండు వందల మంది పిల్లలు 12 రకాలైన కళారూపాలను రెండు రోజుల పాటు ప్రదర్శించనున్నారని చెప్పారు. మొదటి రోజు శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, థియేటర్ ఆర్ట్, విజువల్ ఆర్ట్స్ 2డీ, 3డీ అంశాలలో పోటీలు నిర్వహించనున్నామన్నారు. రెండవ రోజు గాత్ర సంగీతం, వాద్య సంగీతం, కథలు చెప్పటం అంశాలలో పోటీలను నిర్వహించనున్నామని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజు శేఖర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు సతీష్ కుమార్, సైదులు, వివిధ పాఠశాల నుండి వచ్చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**కొత్తగూడెం (లీగల్), సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ):** హత్య కేసులో నిందితునికి 10 ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం గాజుల రాజం బస్తీకి చెందిన బడికెల నరేష్ ఫిర్యాదు ప్రకారం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ టెంపుల్ ఏరియాలో 24 అక్టోర్ 2022 న రాత్రి బడికెల సంతోష్ కుమార్ అలియాస్ బాబీ అనే వ్యక్తి ఆర్కే సూపర్ మార్కెట్ పక్కన గల రాకేష్ పాండ్ షాపు వద్ద సిగరెట్ ప్యాకెట్ తీసుకున్నాడని, పాన్‌షాప్‌లో రాకేష్ డబ్బులు ఇవ్వకుండా రాజేష్‌తో కూడా రాకేష్‌తో గొడవ పడుతుండగా సాయి కుమార్ సంతోష్ కుమార్‌ను సిగరెట్ ప్యాకెట్ డబ్బులు ఇవ్వమని గట్టిగా మందలించాడు. ఈ క్రమంలో సంతోష్ కుమార్ సాయి కుమార్ మెడ మీద గట్టిగా కొట్టాడు. సాయికుమార్ నన్నే కొడతావా నిన్ను ఇప్పుడే చంపేస్తా అంటూ సంతోష్ కుమార్‌ను నెట్టగా పాన్ షాప్ పక్కనున్న రోడ్డు మీద పడిపోగా పక్కనే ఒక సిమెంటు ఇటుక తీసుకొని తలమీద బలంగా కొట్టాడు. రక్తం కారుతుండగా సంతోష్ కుమార్ చనిపోయాడనుకుని సాయికుమార్ పారిపోయాడని, వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడని ఫిర్యాదు ఇచ్చారు. పల్లం సాయికుమార్ అలియాస్ జగడం సాయి దాడి చేసి హత్య చేసిన ఘటనలో ఫిర్యాదు అందుకున్న కొత్తగూడెం త్రీ టౌన్ అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టులో 15 మంది సాక్షులను విచారించారు. ఇరుపక్షాల వాదోపవాదాలు విని పల్లం సాయికుమార్ అలియాస్ జగడం సాయిపై నేరం రుజువు కాగా, 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ ఈ కేసు విచారణను ముందుకు సాగించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మీ ప్రాసిక్యూషన్ నిర్వహించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎన్. వీరబాబు, కోర్టు పీసీ హేమ్లాల్ లు సహకరించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**పాల్వంచ (రూరల్), సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ):** గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించి పాల్వంచ రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లికి చెందిన భూక్యా ప్రసాద్ (36) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కడుపు నొప్పి భరించలేక మనస్తాపంతో ఈ నెల 9న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ప్రసాద్‌ను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఒప్పో ఇండియా ఎఫ్-31 5జీ సిరీస్ లాంచ్

**ఖమ్మం, సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ):** ఒప్పో ఇండియా తన తాజా ఎఫ్31 5జీ సిరీస్‌ను విడుదల చేసింది. మూడు మోడల్స్ - ఎఫ్31 ప్రో ప్లస్, ఎఫ్31 ప్రో, ఎఫ్31 - మన్నికైన బాడీ, శక్తివంతమైన ప్రాసెసర్లు, దీర్ఘకాలిక బ్యాటరీ, మెరుగైన కనెక్టివిటీతో వినియోగదారుల అవసరాలను తీర్చనున్నాయి. ప్రధాన ఫీచర్లు.. మన్నిక... ఏరోస్పేస్ అల్యూమినియం ఫ్రేమ్, ఏజీసీ డీటీ స్టార్ డీ ప్లస్ గ్లాస్, ఐపీ66 /68 /69 రేటింగ్. పెర్ఫార్మెన్స్.. స్నాప్ డ్రాగన్ 7 జెన్ 3, డైమెన్సిటీ 7300 అండ్ 6300 ప్రాసెసర్లు, 72 నెలల ఫ్లూయెన్సీ సర్టిఫికేషన్. బ్యాటరీ... 7,000ఎంఏహెచ్ కెపాసిటీ, 80డబ్ల్యూ సూపర్ వోక్ ఫాస్ట్ ఛార్జింగ్, రివర్స్ ఛార్జింగ్. ఏఐ అండ్ కెమెరా... 50ఎంపీ ఓఐఎస్ కెమెరా, 32ఎంపీ సెల్ఫీ, ఏపీ ఎరాజర్, ఏఐ అన్ బ్లర్, ఏఐ కాల్ అసిస్టెంట్. కనెక్టివిటీ... హంటర్ ఆంటెనా 2.0, టీయూవీ అండ్ జియో టెస్టింగ్ సర్టిఫైడ్, ఔట్ డోర్ మోడ్ 2.0. ధరలు ఇలా ఉన్నాయి..

ఎఫ్ 31 ప్రో ప్లస్ 5జీ : రూ.32,999 నుండి. అలాగే ఎఫ్ 31ప్రో 5జీ: రూ.26,999 నుండి. ఎఫ్31 5జీ: రూ.22,999 నుండి (సెప్టెంబర్ 27 నుండి లభ్యం).

**ప్రత్యేక ఆఫర్లు :** బ్యాంక్ క్యాష్‌బ్యాక్, ఎక్స్ఛేంజ్ బోనస్, నో కాస్ట్ ఈఎంఐ, 180 రోజుల ఫ్రీ డ్యామేజ్ ప్రొటెక్షన్. ఒప్పో ఎఫ్31 5జీ సిరీస్ - భారతీయ వినియోగదారుల కోసం మన్నిక, వేగం, స్మార్ట్ అనుభవానికి కొత్త ప్రమాణం.

## మొక్కలు నాటి సంరక్షించండి..

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు


వీరబాబుకు మొక్క అందిస్తున్న రాజశేఖర్

**చుంచుపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ) :** మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించుకోవడం కూడా అంతే ముఖ్యమని గ్రంథాలయ చైర్మన్ వీరబాబు అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొక్కల రాజశేఖర్, ప్రకృతి హరిత దీక్షాపరురాలు నైనిక రజువా కలిసి గ్రంథాలయ చైర్మన్ వీరబాబును సన్మానించి, ఆయనకు మొక్కను అందజేశారు. వీరబాబు మాట్లాడుతూ మొక్కల రాజశేఖర్ చేస్తున్న ప్రకృతి సేవలను అభినందించారు. ఆయన మున్ముందు మరెన్నో అవార్డులు సాధించి, వనజీవి రామయ్య స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే ప్రకృతి హరిత దీక్ష తీసుకొని పూల బొకేలు వద్దు - పచ్చని మొక్కలే ముద్దు అనే నినాదంతో మొక్కలు పంపిణీ చేస్తున్న చిన్నారి నైనిక రజువాను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. మొక్కలను సంరక్షించడం ద్వారానే భవిష్యత్తు తరాలకు అవి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు.

## ఇసుక అక్రమ నిల్వను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

**బూర్గంపాడు, సెప్టెంబర్ 16(ఆంధ్ర ప్రభ):** బూర్గంపాడు మండల పరిధిలోని సోంపల్లి పంచాయతీ ప్రాంతంలో శ్రీ గంధం నర్సరీ వెనుక పొలంలో అక్రమ ఇసుక నిల్వను మంగళవారం తాసిల్దార్ కె ఆర్ కె వి ప్రసాద్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారి వీర్రాజు తన సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. పంచాయతీ సిబ్బంది సహకారంతో నిల్వ ఉన్న ఇసుక చుట్టూ ముగ్గు పోసి పంచాయతీకి నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇందిరమ్మ ఇళ్ల కూపన్ కలిగిన ట్రాక్టర్ల యజమానులు తమ ట్రాక్టర్లను జాగ్రత్తగా నడిపి లబ్ధిదారికి తక్కువ ధరకే అందించే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తే ఇసుక ఎక్కువ రేటుకు కొనుగోలు చేసుకుంటున్నామని లబ్ధిదారుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. కోపం తీసుకున్న టాక్టర్లు లబ్ధిదారులపై ఎలాంటి భారం పడకుండా లోడింగ్, ట్రాన్స్పోర్ట్ సంబంధించిన వాటికే డబ్బులు తీసుకోవాలని అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా కిన్నెరసాని నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది అన్నారు.

మండలంలో ఏ ప్రాంతం లోనైనా అక్రమ నిల్వలు ఉన్న, లారీలకు అక్రమంగా ఎత్తి రవాణా చేసిన తమ దృష్టికి తీసుకు రావాలని వెంటనే చర్యలు తీసుకుంటామని కోరారు.

## నేడు, రేపు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన

**కొత్తగూడెం, సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ) :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధ, గురువారాలలో జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం ఉదయం పది గంటలకు ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. గురువారం సత్తుపల్లిలో జరిగే కార్యక్రమాలలో పాల్గొంటారు.

# క్రైం న్యూస్

## వేర్వేరు ఘటనల్లో ఇరువురి ఆత్మహత్య

### ఖమ్మం రైల్వే స్టేషన్ లో రైలు పట్టాల కింద పడి యువకుడు ...


మృతదేహాన్ని మార్చురీకి తరలిస్తున్న అన్నం ఫౌండేషన్ సభ్యులు, పోలీసులు

**ఖమ్మం నగరం, సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ):** ఖమ్మం రైల్వే స్టేషన్లో గురుతెలియని యువకుడు మంగళవారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెలకొంది. ఖమ్మం మొదటి ప్లాట్ఫారం టికెట్ బుకింగ్‌కు ఎదురుగా బ్రిడ్జి కింద మెయిన్ లైన్ లో గుర్తుతెలియని 25 సంవత్సరాల యువకుడు గూడ్స్ రైలు కింద మెడబెట్టి పడుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం వేరు అయినది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు మృతుడి కుడి చేతికి త్రిశూలం పచ్చబొట్టు ఉన్నది. ఈ మృతదేహం గురించి ఖమ్మం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కర్రీ శ్రీనివాసరావు సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సారథ్యంలో ఫౌండేషన్ అంబులెన్స్‌తో ఘటనా స్థలం వద్దకు చేరుకొని శవపంచనామ అనంతరం రైల్వే పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురికి తరలించి భద్రపరచారు. ఈ కార్యక్రమంలో అన్నం పౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### భార్య కాపురానికి రావడంలేదని బావిలో దూకి ..


ఆత్మహత్యకు పాల్పడిన పెద్దసాయి

**చర్ల, (ఆంధ్రప్రభ):** భార్య కాపురానికి రావట్లేదని మనస్థాపం చెంది, మద్యానికి బానిసైఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చర్ల మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ హాస్పిటల్ సమీపంలో నివాసముండే కీసరి పెద్ద సాయి (30) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో గత రెండు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో తన ఇద్దరు పిల్లల్ని తీసుకుని భార్య పుట్టింటికి వెళ్లిందని, అప్పటినుండి మృతుడు మద్యానికి బానిసై ఖాళీగా తిరిగేవాడని, సోమవారం ఉదయం నుండి మృతుడు ఎవరికీ కనిపించలేదని, మంగళవారం ఉదయం మండల కేంద్రంలోని వాణి విద్యా నికేతన్ పాఠశాల వెనకవైపు ఉన్న పొలాలలో గల బావిలో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు గ్రామస్తులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటికి తీసినట్లు తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**ఖమ్మం వైద్య విభాగం, సెప్టెంబర్ 16 (ఆంధ్రప్రభ )** విద్యుత్ షాక్ తో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం నగరంలో చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే ఎన్ ఎస్ వి రోడ్డులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్న నాగరాజు (26) డాక్టర్ తన సొంత పనిపై ఇంటికి పంపగా ఇంటి పైన ఉన్న నిచ్చన తీసే సమయంలో హైటెన్షన్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడక్కడికే మృతి చెందాడు. మృతుడికి 6 నెలల క్రితమే ప్రేమ వివాహం జరగడం,కొద్దిరోజులకే మృత్యువాత ఆ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.మృతుడు నిజాం పేట ప్రాంతానికి చెందిన నివాసి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

నమోదిత కార్యాలయం: 501, సల్‌కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ-110025 సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సర్దుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా ఉ॥11.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

**వేలం తేది : 26-09-2025న ఉ॥11.00గం॥లకు**

| క్ర.సం. | శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు |
|---|---|---|---|
| 1 | జూబ్లీహిల్స్ | 103942517551 | పులి ఏ కుమారి |

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్